క్లుప్తంగా

6 నుంచి కృష్ణాష్టమి వేడుకలు



బేతంచెర్ల: పట్టణానికి సమీపంలోని గోపాల కృష్ణ బృందావనంలో కృష్ణాష్టమి వేడుకలు 6,7 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం శ్రీ కృ ష్ణునికి పంచామృతాభిశేకం, అష్టోత్తర శతనామ పూజలు, సాయంత్రం గ్రా మోత్సవం ఉంటుందన్నారు. గురువారం ఉద యం ప్రత్యేక పూజలతో పాటు, 10 గంటలకు ఉట్టికొట్టు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా 12 ఏళ్ల లోపు పిల్లలకు శ్రీ కృష్ణ, రాధ వేశాధరణ పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతిభ చాటిన చిన్నారులకు రూ.1,516, రూ.1,016, రూ.516 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వివాహానికి హాజరైన ఎమ్మెల్యేలు, నంద్యాల ఎంపీ

బేతంచెర్ల: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మద్దిలేటి స్వామి ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, హైమావతి దంపతుల కుమారుడు లోకేశ్వర్‌రెడ్డి, చైతన్య లక్ష్మి వివాహం ఆదివారం షిరిడీ సాయిబాబా ఆలయంలో జరిగింది. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వాదించారు. అదేవిధంగా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ, మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్, వైఎస్సార్ సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి నూతన వధువరులను ఆశీర్వదించారు.

పింఛన్ల పంపిణీలో బనగానపల్లె మొదటిస్థానం

బనగానపల్లె: బనగానపల్లె మండలం సెప్టెంబర్ నెలకు సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో నంద్యాల జిల్లాలో మొదటి స్థానం సాధించినట్లు ఎంపీడీఓ శివరామయ్య ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 12427 పింఛన్లు ఉండగా 12025 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసి 96.77 శాతం సాధించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ

డోన్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం బాలింతలు, గర్భిణులు, రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హోసన్నా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం రోగులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హోసన్నా ప్రార్థన మందిరం నిర్వాహకులు జాన్‌ప్రభాకర్, సిబ్బంది ఫక్రుద్దీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోన్న కేంద్రం

ప్యాపిలి: కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చంద్రనాయక్ విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకుందాం-దేశాన్ని రక్షించుకుందాం నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం పత్తికొండ నుంచి ప్యాపిలికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో దళితులు, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలపై దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు రామచంద్రుడు, అంజనేయులు, రంగడు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం కాలనీలో ఎలుగు సంచారం

మహానంది: మహానంది గ్రామ పరిసరాలను ఎలుగుబంటి వదిలివెళ్లడం లేదు. ఇప్పటికే ఈశ్వర్‌నగర్ కాలనీతో పాటు ఆలయ ప్రాంగణంలోని నంది విగ్రహం, కరివేన సత్రం వరకు వచ్చిన ఎలుగుబంటి తాజాగా ఆదివారం రాత్రి మరోసారి దేవస్థానం కాలనీలోని చివరి వీధిలోకి వచ్చింది. దేవస్థానంలో పనిచేసే ఉద్యోగి లక్ష్మయ్య ఇంటి పరిసరాల్లోకి రాత్రి ఎలుగుబంటి రావడంతో స్థానికులు ఈలలు, కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని లక్ష్మయ్య తెలిపారు. ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ఆయా కాలనీవాసులతో పాటు భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని పట్టుకుని అడవిలో వదిలిపెట్టాలని కోరుతున్నారు. తల్లి ఎలుగుబంటి తప్పిపోయి ఉంటే పిల్లలు వస్తున్నాయా లేక పిల్లలు తప్పిపోయి ఉంటే తల్లి ఎలుగుబంటి వస్తుందా అంటూ పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

కుండపోత

- కోవెలకుంట్లలో 150 మి.మీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఖరీఫ్ పంటలకు ఊపిరి పోసిన వర్షం
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

కోవెలకుంట్ల: మూడు నెలల నుంచి భారీ వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఆకాశానికి రంధ్రం పడ్డట్లు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షంతో జనజీవన స్తంభించి పోయింది. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మోకాటి లోతు నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పట్టణంలోని అమ్మవారిశాల, అయ్యప్పస్వామి వీధులు, బీసీహాస్టల్ తదితర ప్రాంతాల్లో వర్షపునీటితో నిండిపోయాయి. ప్రధాన రోడ్లపై భారీగా నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కల్గింది.

ఖరీఫ్ పంటలకు ఊపిరి

బనగానపల్లె నియోజకవర్గంలోని మండలాల్లో కురిసిన భారీ వర్షం ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఊపిరి పోసింది. సబ్ డివిజన్‌లో ఇప్పటి వరకు 5 వేల హెక్టార్లలో రైతులు మిరప, పత్తి, మినుము, మొక్కజొన్న, పెసర, ఆముదం, బెండ, తదితర పంటలు సాగు చేశారు. వర్షం లేక పైర్లు బెండగిల్లి పోతున్న తరుణంలో భారీ వర్షం ప్రాణం పోసింది. దీంతో రైతులు ఊరట చెందుతున్నారు. వివిధ ప్రాంతాల్లో సాగు చేసిన పైర్లలో భారీగా వర్షపు నీరు చేరింది. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సాగు చేసిన పంటలతో పాటు ఖరీఫ్ చివరి పంటలైన జొన్న, మినుము, పెసర, తదితర పంటల సాగుకు అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొలిమిగుండ్ల: ఎట్టకేలకు వరుణుడు కరునించాడు. ఆదివారం తెల్లవారుజామున మండల పరిధిలోని పలు గ్రామాల్లో మోస్తరు మించి వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్‌లోసాగు చేసిన కంది, జొన్న తదితర పటలకు కురిసిన వర్షం ప్రాణం పోసింది. మండలంలో 35.8 మీ మీ వర్షపాతంనమైదైన్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. బెలుంగుహాల సమీపంలోని కుంటలోకి వర్షం నీరు భారీగా చేరింది. పంట పొలాలు జలమయం అయ్యాయి. కొద్ది రోజుల నుంచి వేసవిని తలపించేలా ఉక్కపోతతో అల్లాడి పోయిన జనం వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బేతంచెర్ల: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మండలంలో 5.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యినట్లు ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఖరీఫ్ పంటలు ఎండుతున్న తరుణంలో కురిసిన వర్షంతో పంటలకు ప్రాణం పోసింది. కంది, ఆముదం, కొర్ర, మొక్క జొన్న పంటలు కళ కళలాడుతున్నాయి.

డోన్ : ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. ఖరీఫ్ పంటలు ఎండుతున్న తరుణంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి మోస్తరు వర్షం కురువడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో పంటలకు మేలు జరుగుతుందని ఏఓ అశోక్‌వర్ధన్ రెడ్డి తెలిపారు. డోన్ మండలంలో 20.8 మి.మీ, ప్యాపిలిలో 48.75 మి.మీ, బేతంచెర్ల మండలంలో 5.5 సెంటి.మీటర్లు వర్షపాతం నమోదైంది.

సంజామల: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. మండలంలోని వాగులు వంకలు పొర్లి పారాయి. సంజామల సమీపంలోని గొండ్రవాగు ఉధృతంగా పారింది. దీంతో సంజామల మీదగా తాడపత్రికి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ వర్షం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఊరటనిచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గుంజలపాడులో వర్షపు నీటితో నిండిపోయిన పంట పొలాలు



సంజామల సమీపంలో పొంగిపారుతున్న గొండ్రవాగు



కోవెలకుంట్ల మండలం సొదరదిన్నె వద్ద మిరపలో భారీగా చేరిన వర్షపునీరు

12న అవుకు మండల మీట్

అవుకు: ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 12వ తేదీన మండల మీట్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతారని, అభివృద్ధి పనులపై చర్చిస్తారని తెలిపారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండలమీట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు.

12 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసు

బనగానపల్లెరూరల్: సచివాలయ విధుల పట్ల అలసత్వం వహిస్తున్న 10 మంది ఎనర్జీ అసిస్టెంట్స్, ఇద్దరు వీఆర్‌ఓలకు జిల్లా కలెక్టర్ మనజిర్ జీలానీ సామూన్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య ఆదివారం తెలిపారు. బనగానపల్లె సచివాలయం-3, సచివాలయం-5, ఇల్లూరుకొత్తపేట, కైప, నందవరం సచివాలయం-1, పలుకూరు సచివాలయం-3, రామతీర్థం, తమ్మడపల్లి, యనకండ్ల, ఎర్రగుడి సచివాయాల్లో విధులు నిర్వహించే ఎనర్జీ అసిస్టెంట్స్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా కైప, ఎర్రగుడి గ్రామాల వీఆర్‌ఓలకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారని చెప్పారు. ఆగస్టు 21 నుంచి 26వ తేదీ వరకు వీరు సచివాయాల్లో బయోమెట్రిక్‌లో హాజరు వేయలేదన్నారు. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఎంపీడీఓ తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

- స్తంభించిన రాకపోకలు



చిన్నకొప్పెర్ల వద్ద వంతెనపై ప్రవహిస్తున్న నీరు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ తోపాటు ఎగువ ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షాలు కురియడంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి. కోవెలకుంట్ల మండలంలోని లింగాల, చిన్నకొప్పెర్ల, ఎం. గోవిందిన్నె, పెద్దకొప్పెర్ల గ్రామాల సమీపాల్లోని ఎర్ర, పాలేరు, నల్ల, కప్పల, కై ప, ఇరుకుమాను వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ఆయా వాగుల వంతెనలపై ఉధృతంగా వర్షపునీరు ప్రవహించడంతో కోవెలకుంట్ల- లింగాల ఆర్ అండ్‌బీ రహదారిలో రాకపోకలు స్తంభించి పోయాయి. లింగాల సమీపంలో పాలేరు వాగు నీరు పంట పొలాల్లో చేరడటంతో సుమారు వంద ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. వాగులు, వంకలు, పొలాల్లోని నీరంతా పట్టణ శివారులోని కుందూనదిలో చేరడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది.



బనగానపల్లె-నంద్యాల రహదారిలో నిలిచిపోయిన రాకపోకలు

బనగానపల్లెలో 57.2 మి.మీ వర్షం పాతం

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దాదాపు 57.2 మిమీ వర్షపాతం నమోదైంది. టంగుటూరు సమీపంలోని వాగు పొంగిపొర్లడంతో ఆదివారం సాయంత్రం వరకు వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. అదేవిధంగా తిమ్మాపురం తదితర గ్రామాల్లో వంకలు వాగులు పొంగిప్రవహించాయి. ఈ వర్షం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఊపరిపోసిందని రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.



కోవెలకుంట్ల శివారులో వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

మూఢనమ్మకాలు విడనాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి తంగమని

- డోన్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి

డోన్ రూరల్ : మూఢనమ్మకాలు, విశ్వాసాలను విడనాడాలని, అప్పుడే సమాజం బాగుంటుందని డోన్ సివిల్ కోర్టు జడ్జి ఎస్ తంగమణి పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీసుధ విద్యాలయంలో ఆదివారం జెవీవీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో జనజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అదేవిధంగా పరిశోధనలు, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. చంద్రయాన్-3 విజయంతో ప్రపంచం మన భారతదేశం వైపు చేస్తుందన్నారు. మూఢనమ్మకాలు వెనుకబాటుకు నెట్టుతాయని, వాటికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి బి.మాణిక్యంశెట్టి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఖాజా, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు నరసింహులు, హెచ్ఎం.అన్వర్‌బాషా, రామనరసప్ప, గోపాల్, రామరాజ్, పునీత్, లతీఫ్, రామమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ రూరల్ : ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని, సమాజంలో గౌరవంగా మెలగాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్‌లకు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్‌లు ఇప్పటికైనా తమ జీవన విధానాన్ని మార్చుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల మూలంగా రౌడీషీటర్లుగా కేసు నమోదయ్యాయని, ఇప్పటికైనా గౌరప్రదంగా మెలగాలని సూచించారు. పాత నేరస్తులపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రౌడీయిజం, గొడవలు, కుట్రలు తదితర అసాంఘిక చర్యల మూలంగా జీవితాలు నాశనమవుతాయని, సమాజంలో ఏ మాత్రం గౌరవం ఉండదనే విషయాన్ని గుర్తించాలన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం హత్యలు, ఘర్షణలకు పాల్పడితే మిమ్ములను నమ్ముకున్న మీ కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. క్షణికావేశాలతో ఘర్షణలు, హత్యలకు పాల్పడడం మూలంగా ఏ మాత్రం ప్రయోజనం ఉండదని, వీటి ప్రభావం జీవితాంతం మిమ్ములను ఇబ్బంది పెడుతూనే ఉంటుందని చెప్పారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అప్పటికీ న్యాయం జరగకపోతే పోలీసుల దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శరత్‌కుమార్ పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

జమిలి ఎన్నికల పేరుతో కొత్త నాటకాలు

డోన్ రూరల్: జమిలి ఎన్నికల పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ కొత్త నాటకాలు మొదలు పెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అంటూ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం డోన్ పట్టణం చేరుకుంది. స్థానిక పాతబస్టాండ్‌లో నిర్వహించిన బహిరంగ సభ ఆయన ప్రసంగించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశానికి, ప్రజలకు చేసిదేమీ లేదని, ధరలు విపరీతంగా పెంచి ప్రజలకు భారం మోపారన్నారు. మళ్లీ అధికారంలోకి రావడానికి నాటకాలు మొదలు పెట్టారన్నారు. డోన్ నియోజకవర్గంలో రహదారులు, ఆసుపత్రి వంటివి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బాగానే అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: శ్రావణమాసం, పెళ్లిళ్లు ఉండటంతో పాటు సెలవురోజు కావడంతో క్షేత్రానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో సుమారు ఇరవైకి పైగా వివాహాలు ఉండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం అష్టవిధ మహామంగళహారతుల నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. - ప్రముఖ టీవీ సీరియల్స్ నటుడు సెల్వరాజ్ (చక్రవాకం ఇక్బాల్), కమెడియన్ శాంతికుమార్ ఆదివారం మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్కుల్లో సకల వసతులు కల్పిస్తాం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : పట్టణ పరిధిలోని పార్కుల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన సకల వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక మహాలక్ష్మి ఆసుపత్రి ఎదురుగా ఉన్న పార్కులో కాఫీ షాప్, టాయ్‌లెట్ల బ్లాక్‌ల నిర్మాణానికి ఆదివారం చైర్మన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఏడు పార్కుల్లో సందర్శకులు, ముఖ్యంగా పిల్లల కోసం రూ.20లక్షలు వెచ్చించి కాఫీ బార్‌లు, టాయ్‌లెట్స్‌ను నిర్మించడంతో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు వాకింగ్ ట్రాక్‌లు, వివిధ రకాల ఆట వస్తువులను ఇప్పటికే పార్కుల్లో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. పార్కుల్లోనూ ప్రజలు ప్రశాంతంగా సేదతీరుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్, ఏఈ సురేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, రైల్వే నాగేంద్ర, కటిక వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాలేషా, మేకల రాజు, కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫీ, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సప్తశైల రాజేష్



పూర్తయిన రోడ్డు పనులు



రోడ్డుకు మధ్యలో వేసిన డివైడర్లు

మారిన రోడ్డు రూపురేఖలు

మండల కేంద్రం ప్యాపిలిలో రూ.16 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. కార్మికులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. దీంతో రహదారులు విశాలంగా సుందరంగా మారాయి. ఇరుకుగా ఉన్న రహదారుల విస్తరణకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరువతో నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన రహదారి నిర్మాణ పనులు, ఇరువైపుల డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లకు ఆకర్షణీయంగా రంగులు వేస్తున్నారు. పండ్లు, కూరగాయలు, పూల బొమ్మలతో వేసిన డివైడర్లు ఆకట్టుకుంటున్నాయి. అన్ని పనులు పూర్తయిన వెంటనే ఆర్థిక మంత్రి కొత్త రోడ్డుకు ప్రారంభోత్సవం చేయనున్నారు. -ప్యాపిలి



డివైడర్లపై బొమ్మలు వేస్తున్న ఆర్టిస్టులు



డివైడర్లకు వేసిన మామిడి పండ్ల బొమ్మలు



వినాయక విగ్రహాలొచ్చాయ్..!

సెప్టెంబర్ 18న వినాయక చవితి పర్వదినం ఉండటంతో కోవెలకుంట్లలో ముందస్తుగా పండగ సందడి నెలకొంది. పట్టణ శివారులోని కానాల అంకిరెడ్డి కాలనీ, పీఆర్ సినిమా థియేటర్ సమీపాల్లో వినాయక విగ్రహాల విక్రయ కేంద్రాల వెలిశాయి. ఐదు అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు ఫ్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో వివిధ రూపాయాల్లో తయారు చేసిన వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు మండలాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీలు ముందస్తుగానే విగ్రహాల కొనుగోలుకు సిద్ధం అవుతున్నారు.

- కోవెలకుంట్ల